www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 4 నవంబర్ 2025



ఇంటి స్థలాలు కేటాయించాలి


మాట్లాడుతున్న యానాది వాసులు

ప్రజాశక్తి - రాయచోటి

తమకు ఇంటి స్థలాలు కేటాయించాలని నియోజకవర్గంలోని రామాపురం మండలం రైతు భరోసా కేంద్రం పక్కన ఉన్న యానాది కాలనీ వాసులు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావేదికలో తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో 50 కుటుంబాలు నివసిస్తుండగా, 25 కుటుంబాలకు ఇళ్లు ఉన్నప్పటికీ వర్షం వస్తే ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన 25 కుటుంబాలకు ఇళ్లు, ఇంటి స్థలాలు కూడా లేవని వాపోయారు. అధికారులు ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని గిరిజన మహిళలు కోరారు. అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ నిశాంత్ కుమార్


అర్జీదారులతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - రాయచోటి

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న, సంక్లిష్టమైన అర్జీలపై దృష్టి సారించి నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంతృప్తి స్థాయిలో వేగవంతంగా, నాణ్యతతో, బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను పరిష్కరించాలని తెలిపారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. నాణ్యతతో కూడిన పరిష్కార మార్గం చూపేలా అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తుందన్నారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని చెప్పారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని సూచించారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన కలిగి ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు వివిధ రకాల అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'17 నుంచి కుష్టు వ్యాధిపై సర్వే'

ప్రజాశక్తి - రాయచోటి

ఈనెల 17 నుంచి 30 వరకు జిల్లా కుష్టు వ్యాధిపై సర్వే నిర్వహించనున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఎంహెచ్ఒ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17 నుండి 30 వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అంగవైకల్య నివారణకు ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కుష్టు వ్యాధిపై ప్రజల్లో అవగాహన, అపోహలు తొలగించి వారికి క్రమం తప్పకుండా చికిత్స అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లుగా పేర్కొన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులను ప్రాథమిక దశలను గుర్తించి వైద్య సేవలు అందిస్తే వ్యాధి పూర్తిగా నయమవుతుందని, జిల్లాలోని ప్రతి ఒక్కరికీ కుష్టు వ్యాధి పరీక్షలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలు సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, డిఎంహెచ్ఒ లక్ష్మీ నరసయ్య, జిల్లా టిబి అధికారి రాధిక, మెడికల్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

రాష్ట్ర స్థాయి పోటీలకు 'మోటకట్ల' విద్యార్థులు


రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడా పోటీలకు సంబేపల్లి మండలంలోని మోటకట్ల హైస్కూల్ విద్యార్థులు తొమ్మిది మంది ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు చప్పిడి పద్మజ తెలిపారు. సోమవారం ఉదయం పాఠశాలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చప్పిడి పద్మజ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు రాయచోటిలో నిర్వహించిన ఎంపికలలో సాఫ్ట్ బాల్‌లో అండర్-14 విభాగంలో బాలురు మోక్షజ్ఞ, బాలికల విభాగంలో నాగదీపిక, అండర్-17 బాలుర విభాగంలో వెంకట్, మనోజ్‌బీ బాలికల విభాగంలో హర్షిత ఎంపికయ్యా రని పేర్కొన్నారు. బేస్‌బాల్‌లో అండర్-14 విభాగంలో మోక్షజ్ఞ, బాలికల విభాగంలో నాగదీపిక, అండర్-17 బాలుర విభాగంలో వెంకట్, బాలికల విభాగంలో హర్షిత ఎంపికయ్యారని చెప్పారు. మారుమూల గ్రామీణ ప్రాంతమైన మోటకట్ల నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలలో వీరంతా పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, వారికి మంచి శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వేణుమాధవ్ రాజును పాఠశాల సిబ్బంది అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థులను మరింత ప్రతిభగల క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది చిదంబర రెడ్డి, పద్మావతి, నాగ శేషారెడ్డి, నాగేశ్వర నాయక్, భాస్కర్, ప్రసాద్ రాజు, నరసింహులు, కృష్ణవేణి పాల్గొన్నారు.

'గిరిజనుల అభివృద్ధే జిపిఎస్ లక్ష్యం'



అభివాదం చేస్తున్న జిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసమే గిరిజన పోరాట సమాఖ్య పనిచేస్తుందని జిపిఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షులు ప్రసాద్ నాయక్ తెలిపారు. సోమవారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో గిరిజన పోరాట సమాఖ్య జాతీయ అధ్యక్షులు వడిత్య శంకర్‌నాయక్ ఆదేశాల మేరకు మదనపల్లె డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ అధ్యక్షులుగా మూడే మంగూ నాయక్, నియోజకవర్గ అధ్యక్షులుగా బుక్యా నరసింహ నాయక్, మదనపల్లె పట్టణ కార్యదర్శిగా కుర్రా రమణా నాయక్, అధ్యక్షులుగా బుక్యా లక్ష్మినాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ గిరిజనులు ఇప్పటికీ కూడుకు, గుడ్డకు నోచుకోక దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మైదాన ప్రాంతాల్లో గిరిజనులకు రాజకీయంగా ఇలాంటి అవకాశాలు లభించడం లేదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా ఎంతో మంది గిరిజనులు ఆధార్ కార్డు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోలేక దుర్భరపరిస్థితుల్లోనే జీవనం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన పోరాట సమైక్య ప్రతి పల్లెలోనూ పర్యటిస్తూ గిరిజనుల దయనీయ పరిస్థితులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారి అభివృద్ధి, సంక్షేమం కోసం పోరాటం చేస్తుందని తెలిపారు. గిరిజన పోరాట సమైక్యలో భాగస్వాములు కావాలనుకున్న గిరిజన బిడ్డలు ఎప్పుడైనా వచ్చి చేరవచ్చని పేర్కొన్నారు. గిరిజన బిడ్డల అభివృద్ధి కోసం పాటుపడవచ్చని పిలుపునిచ్చారు. రాబోయే కాలంలో రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కస్తూరి సుధాకర్

ధైర్య సాహసాలకు ప్రతీకలు గైడ్ కెప్టెన్లు

ప్రజాశక్తి - రాయచోటి

బాలికలకు ఆదర్శప్రాయులు, ధైర్య సాహసాలకు ప్రతీకలు గైడ్ కెప్టెన్లని శిక్షణలో పాల్గొన్న లీడర్ ఆఫ్ ది కోర్స్ కస్తూరి సుధాకర్ అన్నారు. పట్టణంలోని డైట్ కళాశాలలో సోమవారం నుండి ప్రారంభమైన బేసిక్ గైడ్ కెప్టెన్ల 7 రోజుల రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా గైడ్ కెప్టెన్లను ఉద్దేశించి మాట్లాడుతూ బాలికల్లో సేవాభావం, క్రమశిక్షణ, ధైర్యం, సాహసం వంటి మానవీయ విలువలను పెంపొందించడంలో గైడ్ కెప్టెన్ల పాత్ర ఎనలేనిదన్నారు. వారు కేవలం శిక్షకులు మాత్రమే కాకుండా, బాలికలకు ఆదర్శంగా నిలిచి జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణ ఇవ్వాలని చెప్పారు. భవిష్యత్తు సమాజ నిర్మాణంలో గైడ్ కెప్టెన్ల కృషి మరింత పెరగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అడ్వాన్స్ గైడ్ కెప్టెన్లు సుజాత, జిల్లాలోని 55 మంది బేసిక్ గైడ్ కెప్టన్లు పాల్గొన్నారు.

భారత జాతికే గర్వకారణం

ప్రజాశక్తి - వీరబల్లి

ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టులో మన ఉమ్మడి కడప జిల్లా ముద్దుబిడ్డ నల్లపురెడ్డి శ్రీ చరణి కీలక పాత్ర పోషించిందని ఆంధ్రప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత మహిళల క్రికెట్ చరిత్రలో అపూర్వ ఘనత నమోదు కావడం యావత్ భారత జాతికి గర్వకారణమని ప్రశంసించారు. మారు మూల గ్రామంలో పుట్టి పేదరికం, కష్టాలను ఎదురించి కడప జిల్లా పేరును ప్రపంచం వైపు తీసుకెళ్ళిందన్నారు. ఫైనల్‌లో భారత జట్టు ప్రదర్శన అద్భుతమని, వారి నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, పట్టుదలను ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. చారిత్రక విజయం దేశ యువతకు ప్రేరణగా నిలుస్తుందన్నారు.

జోగి రమేష్ అరెస్టు అక్రమం : వైసిపి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

నకిలీ మద్యం తయారీ, విక్రయాల కేసులో మాజీ మంత్రి జోగి రమేష్‌ను పోలీసులు అరెస్టు చేయడం అక్రమమని వైసిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయభాస్కర్, మేధావుల సంఘం రాష్ట్ర నేత జానం రవీంద్ర యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ తరాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ, రవాణా, విక్రయాలు చేసేది టిడిపి వారు అన్నారు. రాజకీయ కక్ష సాధింపులలో భాగంగా కేసులు బనాయించి జైలుపాలు చేసేది మాత్రం వైసిపి నేతలను మాత్రమే అన్నారు. కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృత్యు పాలవడం ప్రభుత్వం వైఫల్యమే అన్నారు. తొక్కిసలాట సంఘటనను కప్పిపుచ్చుకు నేందుకు కాశీబుగ్గ ఆలయం ప్రవేట్‌ఆలయం అని, భద్రత కావాలంటూ నిర్వాహకులు పోలీసులను కోరలేదంటూ ప్రభుత్వ పెద్దలు బుకాయిస్తుండడం హాస్యాస్పదం అన్నారు. భక్తులకు రక్షణ కల్పించలేని తమ చేతగాని తనంపై నుండి ప్రజల దృష్టిని మరలించేందుకు ప్రభుత్వ పెద్దలు జోగి రమేష్‌ను అక్రమంగా అరెస్టు చేయించారని ఆరోపించారు. తంబళ్లపల్లె మద్యం తయారీ కేసులో టిడిపి నేతల హస్తంపై పక్కా ఆధారాలున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం దుర్మార్గం అన్నారు. కేవలం మాజీ సిఎం జగన్ మోహన్‌రెడ్డికి సన్నిహితుడు, ప్రభుత్వ అరాచకా లను, ప్రజా వ్యతిరేక చర్యలను గట్టిగా వ్యతిరేకిస్తున్నారన్న కారణంతో ప్రతీకారంగా జోగి రమేష్‌ను అరెస్ట్ చేయడం అన్యాయమ న్నారు. కూటమి పాలకులు అనుస రిస్తున్న ప్రజా వ్యతిరేక విధా నాలపై ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతున్నా మన్నారు. కార్యక్రమంలో వైసిపి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రేవన సంజీవయ్య పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంచాలి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి-రాయచోటి

సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులలో అవగాహన పెంచాలని, వ్యవసాయంలో పి4 అమలు చేసి ఆదర్శ రైతులను మార్గదర్శకులుగా చూపించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని తన చాంబర్లఓ జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ భూమాత రక్షణ కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భూమాత రక్షణ కార్యక్రమంలోని వివిధ అంశాలను జిల్లా సంయుక్త కలెక్టర్‌కు, కమిటీ సభ్యులకు వివరించారు. దీని ముఖ్య ఉద్దేశం భూసారతను పెంచడం, ఎరువుల వాడకాన్ని తగ్గించడం, రైతులలో సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించడం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అతి ముఖ్యమైన వస్తువుగా ఎరువు పరిగణించబడుతోందని అయితే దీనివల్ల భూసారత తగ్గి భవిష్యత్తులో రైతులు ఇబ్బంది పడవలసి వస్తోందని పేర్కొన్నారు. ఎరువుల వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందని దీనిని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ ఉద్యానవన కృషి విజ్ఞాన కేంద్రం తదితర శాఖల వారు రైతులకు అవగాహన కల్పించేందుకు విభిన్న పద్ధతులలో చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సహజ పద్ధతుల ద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించి వ్యవసాయ ఉత్పాదకతను పెంచిన రైతులను గుర్తించి వారిచే మిగిలిన రైతులకు అవగాహన కార్యక్రమాలు కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని దీనిని వ్యవసాయానికి కూడా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, భూమాత రక్షణ కార్యక్రమం కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

9న జిల్లా సాధన సమితి సమావేశం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఈ నెల 10న మంత్రివర్గ సమావేశం జరగనున్న నేపథ్యంలో, మదనపల్లె జిల్లా ఆకాంక్షను మరోసారి ముఖ్యమంత్రికి గుర్తు చేసేందుకు, 9న ఆదివారం 'పెద్దమనుషుల సమావేశం" పేరుతో మదనపల్లె జిల్లా సాధన ఉద్యమ ప్రతినిధుల ఆత్మీయ కలయిక నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ పిటియం శివప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మదనపల్లె జిల్లా సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన సంఘాల ప్రతినిధులు, రాజకీయ పక్షాల నాయకులు స్వచ్ఛందంగా హాజరై, సమావేశాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఈనెల 7న నిర్వహించాల్సిన మంత్రివర్గ సమావేశం, 10 మార్చడంతో, 4న జరగాల్సిన "పెద్దమనుషుల సమావేశం" 9కి మార్పు చేశామన్నారు. మదనపల్లె కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు సిఫార్స్ చేసిన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులకు మదనపల్లె, తంబళ్లపల్లి, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. 10న నిర్వహించే మంత్రివర్గ సమావేశంలో మదనపల్లె జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలిపితే, 'థాంక్యూ సిఎం' పేరుతో సభ నిర్వహించి, మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తామని శివప్రసాద్ స్పష్టం చేశారు.

జాతీయ రహదారులా..? నరకానికి ద్వారాలా? : కాంగ్రెస్

ప్రజాశక్తి-రాజంపేట

జాతీయ రహదారులా లేక, నరకానికి ద్వారాలా అని కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ బాధ్యులు పూల భాస్కర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ కడప-తిరుపతి జాతీయ రహదారి గుంతలతో నిండిపోయిందని, తరచూ అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా అధికారులకు కానీ, నాయకులకు కానీ పట్టడం లేదని వాపోయారు. కూటమి ప్రభుత్వంలో కనీసం గుంతలు పూడ్చేందుకు కూడా దిక్కు లేదని విమర్శించారు. మూడు రోజుల లోపు జాతీయ రహదారిపై గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టకపోతే జాతీయ రహదారిలోని గుంతల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని, పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవయ్య, రాజబోయిన రమేష్ పాల్గొన్నారు.


వెండి వితరణ చేస్తున్న దాతలు

వీరభద్రుడికి వెండి వస్తువులు వితరణ

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలో వెలసిన శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి పలువురు దాతలు వెండి కిరీటాలు, వస్తువులు వితరణ చేసినట్లు ఆలయ ఇఒ డివి రమణారెడ్డి తెలిపారు. సోమవారం. వైఎస్ఆర్ కడప్ జిల్లా వేంపల్లి పట్టణానికి చెందిన వడ్లకుంట వీరయ్య కుమారుడు రాచయ్య జ్ఞాపకార్థం రాజనరసింహ రావ్ వీరభద్ర స్వామికి 2.50 కిలోల వెండి నాగపడిగతో కూడిన కిరీటం వితరణ చేశారు. వడ్ల కుంట వీరయ్య కుమారుడు రాచయ్య జ్ఞాపకార్థం వి.వి.ఎల్.ఎన్ .రోహిత్ భద్రకాళీ అమ్మ వారికి 981 గ్రాముల వెండి జ్వాలా కిరీటం వితరణ చేశారు. వంకదారి చంద్రశేఖరయ్య జ్ఞాపకార్థం వడ్లకుంట సుభాషిణి వీరభద్రస్వామి ఉత్సవ మూర్తికి 624 గ్రాముల వెండి కిరీటం-1, ఖడ్గం-1, ఎడమ చేయి-1, పాదములు-2, డాల్-1 విరాళంగా ఇచ్చారు. వడ్లకుంట విజయలక్ష్మి దేవమ్మ జ్ఞాపకార్థం వడ్లకుంట వైష్ణవి శ్రీ భద్రకాళీ అమ్మవారి ఉత్సవమూర్తికి 413 గ్రాముల వెండి అమ్మవారి కిరీటం, త్రిశూలం, ఎడమ హస్తం, పాదములు-2 వితరణ చేశారు. వడ్లకుంట వీరయ్య కుటుంబ సభ్యులంతా వీరభద్ర స్వామికి భద్రకాళి అమ్మవారికి మొత్తం 4 కిలోల 240 గ్రాములు వెండి వస్తువులను బహుకరించారు. వీరి కుటుంబ సభ్యులందరికి ఆలయ అర్చకులు అర్చనలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ కార్యనిర్వాహణా ధికారి డి.వి.రమణారెడ్డి తెలియజేశారు.

వృద్ధురాలిపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

వృద్ధరాలిపై తేనెటీగలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన సోమవారం చౌడేపల్లి మండలంలో చోటు చేసుకుంది. బాధితురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. కాటిపేరి గ్రామం, కావలివారిపల్లెకు చెందిన చౌడమ్మ(80) ఊరికి సమీపంలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లింది. కొబ్బరి చెట్టుకింద కూర్చొని ఉండగా పెద్దపేరీ తేనెటీగలు చౌడమ్మ పై ఒక్కసారిగా దాడిచేశాయి. దీంతో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించినప్పటికి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు.

విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలి


ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్: విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలని శ్రీ విజేత కోచింగ్ సెంటర్ నిర్వాహకులు శంకర్‌యాదవ్ తెలిపారు. హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీవిజేత కోచింగ్ సెంటర్‌లో 120 మంది విద్యార్థులకు ఉచిత రక్త గ్రూపు పరీక్షలు నిర్వహించి, గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్‌యాదవ్ మాట్లాడుతూ చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో విద్యా ర్థులు ముందు ఉండాలని, హెల్పింగ్ మైండ్స్ సేవలు ఆదర్శనీయంగా ఉన్నాయని కితాబిచ్చారు. హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు తమ ట్యూషన్ పూర్వ విద్యార్థి కావడం గర్వకారణంగా ఉందన్నారు. అబూబకర్ సిద్దిక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బ్లడ్ గ్రూప్‌లు తప్పక తెలుసుకోవాలన్నారు. తాను చదువుకున్న ట్యూషన్‌లో ఉచిత రక్త వర్గీకరణ కార్యక్రమం చేపట్టి రక్తదాన ఆవశ్యకత తెలియజేస్తుండడం గొప్ప అనుభూతిని ఇస్తోందన్నారు. కార్యక్రమంలో వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణ, హెల్పింగ్ మైండ్స్ సభ్యులు సునీల్, సమీర్, అమీన్, సైసావలి పాల్గొన్నారు.


విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రెవెన్యూ డివిజన్ సాధనకు విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరును రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించాలని పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి జిల్లా కన్వీనర్ నడిమి కండ్రిక సుధాకర్ బాబు అధ్యక్షతన ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం 5వ రోజు రిలే నిరాహార దీక్షను కొనసాగించారు. పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి చేపట్టిన రిలే నిరాహార దీక్షకు సంఘీభావంగా డిబిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు బద్దే భానుప్రకాష్, వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు మాలతోటి నరేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్ విద్యార్థులతో కలసి స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేశారు. మహాత్మా గాంధీ సర్కిల్లో మానవహారంగా ఏర్పడి పీలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణి కుమార్, మాదిగ దళ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి చంద్రయ్య మాట్లాడుతూ పీలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ప్రజలకు ఎంతో అవసరమని మంత్రివర్గ ఉప సంఘం సూచన మేరకు ఈ నెల 10న జరిగే మంత్రివర్గ సమావేశంలో పీలేరు రెవిన్యూ డివిజన్ ఏర్పాటుకు ఆమోదం తెలపాలని కూటమి ప్రభుత్వాన్ని వీరు డిమాండ్ చేశారు. మదనపల్లి జిల్లాలో రెవెన్యూ డివిజన్ కేంద్రానికి కావలసిన అన్ని అర్హతలు ఉన్న కేంద్రం పీలేరు మాత్రమేనని పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు పుంగనూరు నియోజకవర్గంలోని సదుం, సోమల, పులిచెర్ల, రొంపిచెర్ల, చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రవారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాలతో కలిపి ఒక పెద్ద రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే, ప్రజలకు, పరిపాలనకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు కూడా అనుకూలంగా ఉంటుందని, అన్నారు. ఇందుకు స్థానిక శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చొరవ చూపాలని కోరారు. రిలే నిరాహార దీక్ష శిబిరానికి ముస్లిం మైనార్టీ నాయకులు అల్లావుద్దీన్ సంఘీభావం ప్రకటించి దీక్ష చేస్తున్న నాయకులకు నిమ్మరసం అందించి దీక్ష విరమింప చేశారు. అనంతరం పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా విజయవాడలో మంత్రివర్గ ఉప సంఘం సభ్యులను కలిసి పీలేరు రెవెన్యూ డివిజన్ కేంద్రం చేయాలనే విషయంపై వినతి పత్రం సమర్పించాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో మాల మహానాడు ఐక్యవేదిక రాయలసీమ జిల్లాల కన్వీనర్ చీకటపల్లి రామాంజులు, ఎండిపిఎస్ నాయకులు అమృతపురి మల్లికార్జున, వగళ్ల ఆంజనేయులు, భారతీయ అంబేద్కర్ సేన నాయకులు ముల్లంగి గురవయ్య, పల్లెపోగు హరినాథ, దళిత నాయకులు తిమ్మయ్య, ప్రసాద్, నాగలేష్, రాజేష్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు


బోరు బావులో నుంచి ఉబికి వస్తున్న నీరు

ఉబికి వస్తున్న పాతాళ గంగ

ప్రజాశక్తి-కలికిరి

అధిక వర్షాల కారణంగా వ్యవసాయ బోర్లలో నీరు భూమిపైకి ఉబికి వస్తోంది. మండలంలోని మర్రికుంటపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ హెచ్.ఆనందరెడ్డి వ్యవసాయ బోర్లు రెండు గజ్జెలవారిపల్లి సమీపంలో ఉన్నాయి. ఇవి రెండు కూడా ఒక్కొక్కటి వెయ్యి అడుగులకుపైగా లోతు ఉన్నాయి. ఇవి రెండింటిలోను సోమవారం ఉదయం నుండి ఏకధాటిగా నీరు ఉబికి వస్తోంది. స్థానికులంతా బోర్లవద్దకు వచ్చి తిలకిస్తున్నారు. ఈ సందర్భంగా బోరు బావుల యజమాని ఆనందరెడ్డి మాట్లాడుతూ 20 రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూమిలో నీటి శాతం పెరిగి బోరు బావుల్లో నీరు రావడం రైతులకు ఆనందదాయకమని పేర్కొన్నారు. మోటర్ కూడా వేయకుండానే బోరు బావుల నీళురావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. గంగమ్మ తల్లికి ఇష్టమైన పూలు, పసుపు, కుంకములు అందించి పూజలు నిర్వహించామన్నారు.


వెంకటరమణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

వైసిపి బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని నూతనంగా ఎంపికైన రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి పి.జె.వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం ఎంపిపి ఛాంబర్‌లో ఆయనకు ఘనంగా సత్కరించారు. ఎంపిపి శ్యామలమ్మ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు శాలవాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అందరి సహకారంతో పార్టీని బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి కరీం, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి సుధాకర్‌రెడ్డి, పలువురు సర్పంచ్‌లు, నాయకులు కోటిరెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న విచారణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో ఎక్సైజ్ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో గోవాకు చెందిన ముగ్గర్ని ఎక్సైజ్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. గోవాలో పనిచేస్తున్న వీరిని మదనపల్లె ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. జిల్లా ఎక్సైజ్ ఎఇఎస్ జోగేంద్ర నిందితుల ప్రమేయంపై పూర్తి స్థాయిలో వివరాలను సేకరిస్తున్నారు. మరిన్ని వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది.


ఎఒకు వినతి పత్రం సమర్పిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట

అన్ని అర్హతలు కలిగిన రాజంపేటను అన్నమయ్య జిల్లా కేంద్రం చేయాలని స్థానిక విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ కోరారు. సోమవారం విభిన్న ప్రతిభావంతులు ఆర్‌టిసి బస్సు స్టాండ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ట్రై సైకిళ్లపై ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ కార్యాలయ పాలనాధికారికి వినతి పత్రం సమర్పించారు. రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాజంపేట పార్లమెంటు, అసెంబ్లీ కేంద్రాలుగా ఉందని, 1905 నుంచే రాజంపేట డివిజనల్ కేంద్రమని, పైగా రాజంపేట సబ్ కలెక్టర్ అంటే ఐఎఎస్ కేడర్ కలిగిన వారు ఇక్కడ సబ్ కలెక్టర్‌గా ఉంటారని వివరించారు. ముఖ్యంగా రాజంపేటలో నీరు సమృద్ధిగా లభిస్తుందని, చెన్నై - ముంబైలను కలుపుతూ పురాతన కాలంగా పెద్ద రైల్వేలైను, ప్రధాన రహదారి ఉన్నాయని వివరించారు. జిల్లాకు కావాలసిన అన్ని అర్హతలు రాజంపేటకు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల క్రికెట్ క్రీడాకారుడు శివకోటి, విభిన్న ప్రతిభా వంతుల సేవా సంఘం పుల్లంపేట అధ్యక్షులు మల్లు సుబ్బ నరసారెడ్డి, రాజంపేట ఉపాధ్యక్షుడు ఖాదర్ బాషా, చంద్రశేఖర్, కృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

మునగ సాగుతో ఆదాయం

ప్రజాశక్తి - వీరబల్లి : మునగ సాగు వల్ల ఆదాయం వస్తుందని జిల్లా జీవనోపాదుల ప్రాజెక్ట్ మేనేజర్ గంగార్జున పేర్కొన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో మండల అనుబంధ సంస్థల అధికారుల సమన్వయ సమావేశంలో మాట్లాడుతూ మునగ రైతులకు ఉపాధి పథకం ద్వారా ఒక ఎకరానికి రూ.1.17 లక్షలు వర్తిస్తాయన్నారు. మండలంలోని వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ, ఉద్యాన శాఖల సమన్వయంతో చేస్తారన్నారు. తమిళనాడులోని పెర్యాకులం యూనివర్సిటీ నుండి మేలురకం మునగ విత్తనాలు తెపించామన్నారు. కార్యక్రమంలో ఎపిఎం ఖాదర్ వలి, మండల వ్యవసాయ శాఖ అధికారి స్వాతి, ఉపాధి ఎపిఒ చంద్రకళ, సిసిలు గంగాధరం, సుధాకర్, నాగేంద్ర, యాంకర్ పర్సన్ అనిత, సిఆర్‌పిలు జ్యోతి, రెడ్డెమ్మ, అనురాధ, రైతుమిత్రలు జనమేజయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

గాయపడ్డ కార్యకర్తలకు పరామర్శ

ప్రజాశక్తి-రామాపురం


కార్యకర్తను పరామర్శిస్తున్న నాయకులు

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్యకర్తలను మంత్రిసోదరుడు, నియోజవర్గం టిడిపి నాయకుడు లక్ష్మిప్రసాద్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మండలంలోని రాచపల్లి పంచాయతీ బాల్‌రెడ్డిగారిపల్లెకు చెం దిన టిడిపి కార్యకర్తలు శివారెడ్డి, మోహన్‌రెడ్డినెఆయన పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగింది, ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉంది అడిగి తెలుసుకున్నారు. ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులను యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రాచపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు గంగిరెడ్డి,రామ్మోహన్‌రెడ్డి, మదన్మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కలికిరి : లాస్యకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-కలికిరి

జిల్లా చెస్ పోటీలో కలికిరి విద్యార్థులు మెరుగైన ప్రదర్శన చేసి రెండు బహుమతులు గెలుచుకున్నారు. ఆదివారం నెల్లూరులో జరిగిన 5 జిల్లాల ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో అండర్-13 బాలికల విభాగంలో కలికిరి బాలిక ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న లాస్య 2వ బహుమతి గెలుచుకుంది. అండర్-15 బాలుర విభాగంలో కలికిరి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుకున్న కమల్ మూడవ బహుమతి సాధించారు. ఈ విద్యార్థులు ఇద్దరూ కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీనియర్ తెలుగు పండితులు మూగచింతల దేవిప్రసాద్ కుమార్తె, కుమారుడు కావడం విశేషం. ఈ సందర్భంగా విద్యార్థుల తండ్రి దేవి ప్రసాద్ మాట్లాడుతూ తన బిడ్డలు జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్లో ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకోవడం ఆనందదాయకమని, వారి విజయానికి సహకరించిన వ్యాయామం ఉపాధ్యాయులు చిన్నప్ప, వారి కోచ్ ఆనంద్ మోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇలాంటి పథకాలు మరెన్నో గెలుచుకుని పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

వీరబల్లి : మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ గేమ్స్ సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెడ్డివారిపల్లి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు శివయ్య తెలిపారు. అండర్-17 విభాగంలో జి.వెంకట నరసింహ, కె.రాజేష్, అండర్-14 బేస్ బాల్‌లో జె.మణికంఠ కడప మాంటిసోరి స్కూలులో నిర్వహించిన జిల్లా సెలక్షన్స్ వాలీబాల్ అండర్-14 బాలికలు బి వైష్ణవి, బి వర్షిత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడానికి కృషి చేసిన వ్యాయామ సంచాలకులు ఆర్.రవీంద్ర రాజును పాఠశాల ఉపాధ్యాయ బృందం, కమిటీ చైర్మన్ అభినందించారు.



వీరబల్లి : క్రీడల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

అభివృద్ధికి ఆటంకంగా ప్రభుత్వ నిర్ణయాలు : 'చింతల'


కోటి సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల ఫలితంగా వైద్య, విద్యారంగాల అభివృద్ధికి ఆటంకంగా మారాయని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని బోడుమల్లువారిపల్లె, ముడుపులవేముల, కావలిపల్లె పంచాయతీల్లో వైద్య కళాశాలలు ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదనే డిమాండ్‌తో కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు వైద్యవిద్య అందించడమే లక్ష్యంగా 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. గత ప్రభుత్వంలో 7 మెడికల్ కళాశాలల భవనాల నిర్మాణాలు కూడా పూర్తయ్యాయని, మిగిలిన 10 కళాశాలల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. మరో రూ.5 వేల కోట్లు ఖర్చు పెడితే కళాశాలల నిర్మాణాలు పూర్తవుతాయని తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతగాని తనంతో పేద, మధ్య తరగతి విద్యార్థుల ప్రయోజనాలు పట్టించుకోకుండా మెడికల్ కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి, జడ్‌పిటిసి ఎ.టి.రత్నశేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు బి.సి.జయలక్ష్మీదేవి, రాజేష్, లోకనాథరెడ్డి, ఎంపిటిసి చెంగల్రాయుడు, రిటైర్డ్ ఎఎస్‌పి సూర్యనారాయణరెడ్డి, నాయకులు బి.సి.అమరనాథరెడ్డి, పురుషోత్తంరెడ్డి, జ్ఞానశేఖర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎస్.చాన్‌బాషా, ఎం.మధుసూదన్‌రెడ్డి, రామిరెడ్డి, గంగిరెడ్డి, వెంకటరమణ, అశోక్, హరి, మణి, ఉదయ్ కుమార్. అశోక్ నాయుడు, అమరనాథనాయుడు, మల్లికార్జున, వెంకటప్పనాయుడు, పురుషోత్తం, ప్రసాద్, సైషావలి, రమేష్, గణేష్, మహితా ఆనంద్, చక్రధర్, శ్రీనాథరెడ్డి, జయపాల్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, కాలనీ చిన్న, స్టాంపుల మస్తాన్. నాగభూషణం, పరమేష్, రాజేంద్రాచారి. షాకీర్, మునీర్, అబీద్, దావూద్, అల్లాబక్షు, రియాజ్, షబీర్, సపూరా, రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, వి.పి.రామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ధనుంజయరెడ్డి, సదాశివ, గోవర్ధన్ రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

ఆదర్శపుత్రుడు సంపత్ కుమార్ : వైవీయూ విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ నివసించిన బంగళా స్థలాన్ని బ్రౌన్ స్మారక గ్రంథాలయ ఏర్పాటుకు ఇస్తానని సి.ఆర్.కృష్ణస్వామి ఇచ్చిన మాటను నిలబెట్టిన ఆదర్శపుత్రుడు సి.కె.సంపత్ కుమార్ అని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ స్థలదాత సి.కె.సంపత్‌కుమార్ 85వ జయంతి స్మారకోపన్యాసం సోమవారం నిర్వహించారు. తొలుత అతిథులంతా కలిసి స్థలదాత సి.కె.సంపత్ కుమార్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ మనిషి తన జీవితంలో స్వార్థాన్ని వదిలిపెట్టి పరుల కోసం ఉపకారిగా పనులు చేస్తే చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఆ కోవకు చెందిన వ్యక్తే సంపత్‌కుమార్ అని అన్నారు. గ్రంథాలయ నిర్మాణానికి 20 సెంట్ల స్థలమివ్వడమే కాక, సి.పి.బ్రౌన్ మెమోరియల్ ట్రస్టుకు అధ్యక్షులుగా సేవలందించి, సంస్థ అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. గ్రంథాలయ నిర్మాణానికి కావాలసిన నిధులను సేకరించడం కోసం డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రితో కలసి అనేక ప్రాంతాలు తిరిగి తోడ్పాటు నందించారన్నారు. అందుకు కృతజ్ఞతగా సి.కె.సంపత్ కుమార్ జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించేలా చర్యలు చేపట్టి, ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఆ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ మద్రాసు రాజధానిగా ఉన్నప్పుడు తెలుగువారంతా వ్యాపారం, విద్య, ఇతర అవసరాల నిమిత్తం మద్రాసుకు వెళ్ళే రోజుల్లో మద్రాసు నుంచి కడపలో నివాసముండడానికి వచ్చిన ఘనత సంపత్ కుమార్ తండ్రి కృష్ణస్వామికి దక్కుతుందన్నారు. 1976లో ఆచార్య జి.ఎన్.రెడ్డి, బంగోరె, ఆరుద్ర, ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి కలసి బ్రౌన్ నివసించిన బంగళా శిథిలాలను గుర్తించి, ఆ స్థానంలో బ్రౌన్ స్మారక గ్రంథాలయం ఏర్పాటు చేయాలని అప్పటి కలెక్టర్ డాక్టర్ పి.ఎల్.సంజీవరెడ్డిని కోరడంతో దాని నిర్మాణానికి బీజం పడిందన్నారు. సభాధ్యక్షులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ సంపత్ కుమార్ కుమార్తె సి.ఎస్.సుప్రజ మరో 5 సెంట్లు గ్రంథాలయానికి బహూకరించడం ఆ కుటుంబానికి ఉన్న దాతృత్వ గుణానికి ప్రతీక అన్నారు. విప్లవకవిగా శ్రీశ్రీ అందించిన సాహిత్యం యువతలో చైతన్యాన్ని నింపేలా ఉంటుందన్నారు. ప్రధానవక్త, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాచ్య పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు 'శ్రీశ్రీ వచన సాహిత్యం' అనే అంశంపై ప్రసంగిస్తూ శ్రీశ్రీ సాహిత్యమంటే మహాప్రస్థానం, మరో ప్రస్థానం, సిప్రాలి, ఖడ్గసృష్టి మాత్రమే కాదని, వచన సాహిత్యంలో కూడా శ్రీశ్రీ విశిష్టత స్పష్టమవుతుందని చెప్పారు. శ్రీశ్రీ రచించిన 'పరిణయ రహస్యం' అనే నవలికను, పలు నాటికలను, కథలను ఉదాహరించి సమాజపు పోకడను శ్రీశ్రీ ఆవిష్కరించిన తీరును వివరించారు. అనంతరం అతిథులు వక్త ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి సమన్వయం చేశారు. కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, నాగరాజు, ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, మౌనిక, సిబ్బంది, శ్యామసుందర్‌రెడ్డి, కె.రాజారెడ్డి, కరీముల్లా, కొత్తపల్లి రామాంజనేయులు, వెంకటేశ్, సుబ్బరాయుడు, జయరామిరెడ్డి, ఎస్.ఎండి. బాషా పాల్గొన్నారు.


సంపత్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ రాజశేఖర్

29, 30న బాలోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈ నెల 29, 30తేదీల్లో పెద్దఎత్తున బాలోత్సవం నిర్వహిస్తున్నామని, మూడవ బాలోత్సవం పిల్లల పండుగ కాదని, భావి భారత పౌరుల పండుగ అని జిల్లా అధ్యక్షులు గోపాల్ తెలిపారు. సోమవారం ఎస్.వి.ఇంజినీరింగ్ కళాశాలలో బాలోత్సవంపై నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పిల్లవాడిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందని, వాటిని వెలికి తీసేదే కడప బాలోత్సవం ఉద్దేశమని తెలిపారు. ఈ నెల 29, 30వ తేదీల్లో కడప మరియాపురం గర్ల్స్ హైస్కూల్లో కడప బాలోత్సవం మూడవ పిల్లల పండుగ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు కడప బాలోత్సవం మూడవ పిల్లల పండగలో పాల్గొనాలని తెలిపారు. గౌరవ అధ్యక్షులు నాగమణిరెడ్డి మాట్లాడుతూ పిల్లలు భూమ్మీదకు సమస్త దుఃఖాన్ని చెరపడానికొస్తారని చెప్పారు. పెద్దల ప్రపంచానికి రంగులేయడానికొస్తారని పేర్కొన్నారు. మనల్ని ముందుకు నడపడానికొస్తారని తెలిపారు. మన కోసం ఓ అందమైన ప్రపంచాన్ని సృష్టిస్తారని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ అందరి సహకారంతో మూడవ పిల్లల పండుగకు సిద్ధమయ్యామని తెలిపారు. మూడవ పిల్లల పండుగను జయప్రదం చేయడంలో సహకారాన్ని అందించాలని కోరారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు గోపాల్

ఉరుసు ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - కడప అర్బన్

అమీన్ పీర్ పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడుపుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి పి.గోపాల్ రెడ్డి ఒక ప్రకటన పేర్కొన్నారు. ఈనెల 5 నుంచి 9 వరకు రైల్వే స్టేషన్, ఆర్‌టిసి బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 9న దర్గా నుంచి వాటర్ గండికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఛార్జీ రూ.20 మాత్రమే అని తెలిపారు. ఈనెల 5న కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక బస్సులు ఆయా డిపోల నుంచి వెళ్లడానికి, రావడానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణం మరచిన ప్రభుత్వం

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలైనా ఒక్క ఇల్లు కూడా పేదలకు నిర్మించలేదని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1975లోనే 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమంలో పేదలకు ఇళ్ల నిర్మాణానికి ప్రాముఖ్యతనిచ్చారని తెలిపారు. ఈ స్ఫూర్తితో 2004-2014 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు దాదాపు 60 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చారని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం మంజూరు చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ఇంతవరకు అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పేదలకు ఇళ్ల నిర్మాణంలో, మహిళా సంక్షేమం విషయంలో మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అమలు చేయాలని తులసిరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


షెడ్డును ప్రారంభిస్తున్న దాతలు హరిప్రసాద్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న

మల్లయ్యకొండపై రూ.6 లక్షలతో షెడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయం వద్ద భక్తులకు సౌకర్యార్థం కడప జిల్లాకు చెందిన ఎన్‌ఆర్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి, లక్ష్మి ప్రసన్న దంపతులు, కీర్తిశేషులు మద్దిరెడ్డి గంగిరెడ్డి జ్ఞాపకార్థం రూ.ఆరు లక్షలతో ఆలయం వద్ద షెడ్డు నిర్మాణం చేశారు. సోమవారం దాత కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. ఆ షెడ్డును ప్రారంభించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. వారి ఇలవేల్పు దేవుడు మల్లికార్జున స్వామి కావడంతో ప్రతి ఏడాది ఆలయానికి రావడం అభివృద్ధికి సహకరించడం చేస్తున్నారు. వారి పిల్లలకు తలనీలాలు సమర్పించి మొక్కలు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వారి దాతృత్వాన్ని ఇఒ మునిరాజా ప్రశంసించారు.

కిటకిటలాడిన మల్లయ్యకొండ

కార్తీకమాసం సందర్భంగా సోమవారం మల్లయ్యకొండ భక్తుల శివనామస్మరణలతో మార్మోగింది. రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు భ్రమరాంబ మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున ఉదయమే స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. కార్తీక రెండవ సోమవారం మహిళలు భారీ సంఖ్యలో కేదారేశ్వరి వ్రతం నోచుకున్నారు. ఆలయానికి దిగువన ఉన్న వెలుగు మల్లమ్మ కు అమ్మవారికి పూజారి శేఖర్ విజయనిర్మలలు ప్రత్యేక అలంకరణతో వెలుగు మల్లమ్మను అలంకరించారు. అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయుడు రమణ

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - పుల్లంపేట : మండల పరిధిలోని గలవాయిపల్లి ఆదర్శ పాఠశాలలో మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ బహుమతులు అందించడం వల్ల విద్యార్థులు మరింత ఉత్సాహంతో బాగా చదవగలరని, మిగిలిన విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తారని తెలియజేశారు.

చెరువులకు జలకళ

ప్రజాశక్తి-బి.కొత్తకోట: నగర పంచాయతీ పరిధిలోని పెద్దచెరువు మొరవలో అడ్డుగా ఉన్న చెట్లను నీటి సంఘం ఉపాధ్యక్షులు మద్దేపల్లి శంకర, రైతులు సహకారంతో తొలగించారు. చాలా రోజుల తరువాత చెరువు నిండుగా ఉండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ జి.వి.పల్లవి స్పందించడంతో పెద్దచెరువు మొరవలో అడ్డుగా ఉన్న వ్యర్థాలు పంచాయతీ కార్మికులు తొలగించారు. హెచ్‌ఎన్‌ఎస్, ఇరిగేషన్ అధికారులు నీటి సంఘం ఉపాధ్యక్షుల చొరవతో ట్టచివరికి బి.కొత్తకోట నగర పంచాయతీ పరిదిలోని పెద్దచెరువు నిండి జలకళను సంతరించుకుంది. వర్షపు నీటిని పొదుపు చేసేందుకు నీటి సంఘం సభ్యులు చూపుతున్న చొరవపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు

క్రైం కార్నర్


క్షతగాత్రులను 108లో తీసుకొచ్చిన సిబ్బంది

ఆటో బోల్తా : నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఆటో బోల్తాపడిన ఘటనలో ఒకే కుటుంబంలోని ముగ్గురితోపాటు టో డ్రైవర్ గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. గుర్రంకొండ మండలం, టి.రాసుపల్లికి చెందిన సిద్ధారెడ్డి అనే వృద్ధుడికి ఆరోగ్యం బాగలేదని అతని కుమార్తె అనసూయమ్మ, మనవరాలు సాయివాణి అదే ఊరికి చెందిన రెడ్డప్పరెడ్డి అనే వ్యక్తి ఆటో బాడుగకు మాట్లాడుకుని మదనపల్లెకు బయలుదేరారు. మార్గమధ్యంలోని శానిటోరియం వద్ద కుక్క అడ్డు రావడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న హోమియోపతి కాంపౌండర్ సోమవారం మృతి చెందాడు. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలం సిటియంకు చెందిన విజయ్ కుమార్ (50) తరిగొండ హోమియోపతి ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నారు. గతనెల 25న సొంతపనిపై ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో కొత్తవారిపల్లె వద్ద చింత చెట్టును ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన విజయ్ కుమార్ తిరుపతిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని సిఐ తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మరో వ్యక్తి...

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలం, చిలకవారిపల్లెకు చెందిన రమణ (55) కూలీ పనులు చేసుకుంటూ జీవనం చేసేవాడు. ఈ నెల 1న మద్యం తాగి ఇంటికి రావడంతో కుమారుడు రెడ్డిశేఖర్ మందలించాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రమణ ఇంట్లోంచి బయటికి వెళ్లి మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రిక తరలించగా, పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కళా వెంకటరమణ తెలిపారు. మృతునికి భార్య శ్రీలక్ష్మి, కుమారుడు రెడ్డిశేఖర్ ఉన్నారు.